

మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న షబ్బీర్‌అలీ

మహిళల ఆర్థిక ఉన్నతితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

దోమకొండ, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షబ్బీర్‌అలీ హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థిక, సామాజిక ప్రగతి రాష్ట్రఅభివృద్ధికి బలమైన పునాదని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ బస్సులు, క్యాంటీన్‌ల ఏర్పాటుకు సమాఖ్యల ద్వారా ప్రభుత్వం రుణాలను అందిస్తోందన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో సీఎం ముందుకెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు విజయలక్ష్మి, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దేవాలయాలకు నిధుల మంజూరు

కామారెడ్డిటౌన్: నాలుగు దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద రాష్ట్రదేవాదాయశాఖ నిధులు మంజూరుచేసినట్లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం కామారెడ్డిలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయం వద్ద నిధులకు సంబంధించిన వివరాలను అర్చకులకు వివరించారు. విశిష్టత కలిగిన ఆలయాలను గుర్తించి నిత్యం పూజలుచేసే అర్చకులకు కనీస వేతనం, ఆలయాల నిర్వహణకు కనీస ఖర్చుల కింద ప్రతినెలా నిధులుమంజూరు చేస్తుందని తెలిపారు. పూజారికి రూ.6వేలు, ఆలయ నిర్వహణకు రూ.4వేలు పూజారి ఖాతాలో ప్రభుత్వం జమచేస్తోందని తెలిపారు. మాచారెడ్డి మండలం ఇసాయిపేటలో గల రాజరాజేశ్వర స్వామి ఆలయం, కామారెడ్డి మండలం క్యాసంపల్లిలోని హనుమాన్ దేవాలయం, భిక్కనూరులోని దాసంజనేయ స్వామిఆలయం, బీబీపేటలోని యాడారం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు కైలాస్‌శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం పాట

మద్నూర్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా రవాణా చేస్తూ పట్టుబడిన ఇసుకను వేలం వేస్తున్నట్లు డోంగ్లి తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను మద్నూర్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. వాటిలో ఒక టిప్పరు ఇసుక, డోంగ్లి శివారులో డంపు చేసిన ఇసుకలకు మంగళవారం వేలం పాట నిర్వహించనున్నట్లు డోంగ్లి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆసక్తిగల వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రిజర్వేషన్లు తారుమారు!



- పెరిగిన జనరల్ కేటగిరి సీట్లు
- బీసీ సీట్లలో తగ్గుదల
- తాజా రిజర్వేషన్లతో బీసీల ఆశలు నిరాశ
- ముగిసిన సర్పంచ్,వార్డు రిజర్వేషన్ల ప్రక్రియ
- అభ్యర్థుల వేటలో రాజకీయపార్టీలు

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 50శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ఇచ్చిన హామీతో బీసీ వర్గాల్లో ఎన్నో ఆశలు నింపాయి. కానీ చివరకు పాత పద్ధతి రిజర్వేషన్ల ప్రకారమే ప్రభుత్వం ఎన్నికలకు పోతుండడంతో రిజర్వేషన్ల ఖరారులో లెక్కలు తప్పాయి. బీసీ వర్గాలు ఈసారి ఆయా స్థానాల్లో తమకే రిజర్వ్ అవుతుందని ఆశించిన తాజా రిజర్వేషన్లతో నిరాశే మిగిలింది.

అభ్యర్థుల వేటలో పార్టీలు

తాజా రిజర్వేషన్లలో లెక్కలు మారడంతో పలువురు ఆశావహులు నిరాశకు లోనయ్యారు. ఆయా గ్రామాల్లో మహిళలకు ఉన్న స్థానాలు జనరల్‌గా మారడం, జనరల్‌గా ఉన్న స్థానాలు మహిళలకు కేటాయింపులు చేశారు. అధికార పార్టీ కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేస్తున్నాయి. ఎన్నికలపై ఆయా ప్రధాన పార్టీల ముఖ్యనేతలు ఆశావహులను పోటీలో నిలిపేందుకు దిశానిర్దేశం చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులు కూడా ముందస్తు ప్రజల మద్దతు కూడగట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా పల్లెల్లో ఎన్నికల వాతావరణం నెలకొంటుంది. గ్రామం ఏ కేటగిరిలో పడింది.. ఈసారి ఎవరికి అవకాశం వంటి ప్రశ్నలతో పల్లె ప్రజల్లో చర్చసాగుతుంది.

కామారెడ్డి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియ దాదాపు ముగిసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వేడి మొదలైంది. రిజర్వేషన్ల ప్రక్రియతో రాజకీయసమీకరణలో మార్పులు చోటుచేసుకున్నాయి. గత రిజర్వేషన్లతో పోలిస్తే ఈసారి జనరల్ కేటగిరి పెరగడం,బీసీ స్థానాలు తగ్గడం, ఎస్టీ కేటగిరి పెరగడం రాజకీయ నాయకుల లెక్కలను తలకిందులు చేసింది. పంచాయతీరాజ్ చట్టం నిబంధనల మేరకు మహిళలు,బీసీ, ఎస్సీ,ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్‌లు కేటాయించారు. జిల్లాలో 25 మండలాల పరిధిలో 532 గ్రామ పంచాయతీలు, 4,656 వార్డులకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయింది.

రిజర్వేషన్ల తీరు ఇలా..

జిల్లావ్యాప్తంగా 532 గ్రామపంచాయతీల వారిగా కేటాయించిన రిజర్వేషన్లలో ప్రతి సామాజిక వర్గానికి జీవో నిబంధనలను అనుసరించి కేటాయింపుచేశారు. జిల్లాలో ప్రస్తుతం సామాజిక వర్గాల వారిగా కేటాయింపులు జరిగిన రిజర్వేషన్ల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జనరల్ కేటగిరిలో 23.21శాతం, జనరల్ మహిళా విభాగంలో 20.71 శాతంతో మొత్తం జనరల్ వర్గం వాటా 43.92 శాతం ఉంది. బీసీ వర్గం మొత్తం వాటా 16.07శాతం కాగా ఇందులో మహిళ కేటగిరిలో 7.14శాతం జనరల్‌లో 8.93శాతంగా లెక్కించారు. ఎస్సీ మొత్తం వర్గం వాటా 19.28శాతం కాగా ఇందులో జనరల్ శాతం 11.07, మహిళ విభాగంలో 8.21 శాతంగా ఉంది. ఎస్టీ వర్గంలో మొత్తం వాటా 20.71 శాతం కేటాయించగా ఇందులో 100శాతం గ్రామాలు కలుపుకొని ఎస్టీ జనరల్ 12.4 శాతం, ఎస్టీ మహిళల విభాగంలో (మిగతా 8లో..)

తాజా రిజర్వేషన్లు ఇలా..	మొత్తం స్థానాలు	100 శాతం ఎస్టీ	ఎస్టీ	ఎస్సీ	బీసీ	అన్‌రిజర్వ్‌డ్	మహిళలకు రిజర్వ్
సర్పంచ్	532	65	25	79	123	240	242
వార్డులు	4656	498	224	732	117	2082	1995



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కు.ని.పై పురుషులకు అపోహలొద్దు

భిక్కనూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురుషులు కుటుంబ నియంత్రణ (వ్యాసెక్టమి)పై అపోహలు వీడాలని భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దివ్య కోరారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పురుషులకు చేసే కుటుంబ నియంత్రణ (వ్యాసెక్టమి) కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ ఈనెల 21 నుంచి డిసెంబరు 4వరకు అన్నిగ్రామాల్లో ఈ కార్యక్రమంపై ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆడవారు తరుచూ శస్త్రచికిత్స చేసుకోవడంతో వారికి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ ఆపరేషన్ కారణంగా పురుషుల శరీర పటుత్వానికి, దాంపత్య జీవితానికి ఆటంకమూ ఉండదన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో వెంకటరమణ, సిబ్బంది, ఆశాలున్నారు.

నలుగురు ఎస్ఐల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన పోలీసు ఉన్నత అధికారులు

దోమకొండ, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దోమకొండలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న డి.స్రవంతిని కామారెడ్డిటౌన్‌కు బదిలీ చేశారు. బీబీపేట ఎస్ఐ ఎం.ప్రభాకర్‌ను దోమకొండకు, రిజర్వు నుంచి జి.రాజును మద్నూర్‌కు, మద్నూర్ ఎస్ఐ కె.విజయ్‌ను బీబీపేటకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా రాజు సోమవారం మద్నూర్ పోలీసుస్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు.

- మనిషికి చదువే ఆధారం — పేదలకు అంతర్జాతీయ స్థాయి విద్యనందించే ఏకైక రాష్ట్రం తెలంగాణ : పోచారం శ్రీనివాస్‌రెడ్డి 6
- ఒళ్లంత.. ‘చలి’ంత — రోజురోజుకూ పెరుగుతున్న చలి; జలుబు, జ్వరాలతో ఆస్పత్రులకు క్యూ 7

వైద్యులు 24/7 అందుబాటులో ఉండి

వైద్యసేవలు అందించాలి

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ఆరోగ్య కేంద్రభవాన్ని ప్రారంభిస్తున్న సురేష్ షెట్కార్, పోచారం

నసురుల్లాబాద్,నవంబరు24 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల ప్రజలకు వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలను అందించాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ.కోటీ 43 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాన్ని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు షెట్కార్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పేద ప్రజలకోసం అత్యవసర వైద్య సేవలు, ప్రసూతి సేవలు, సాధారణ చికిత్సల కోసం ప్రజలకు సదుపాయాలు అందుబాటులో ఉండేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను నిర్మించడం జరుగుతుందన్నారు.

కోటి మంది మహిళలకు చీరలు

ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీలో భాగంగా ప్రభుత్వం కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టిందని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు షెట్కార్ అన్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లోని మహిళలకు 48వేల చీరలు అందజేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల శ్రేయస్సు, స్వయం సమృద్ధి, ఆర్థిక సాధికారత కోసం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని, మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తోందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కోటి మందికి (మిగతా 8లో..)



ఎరువులను పరిశీలిస్తున్న ఏవో రాజలింగం

ప్రతీ కొనుగోలుకు రశీదు తప్పనిసరి

గాంధారి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుల మందులకు సంబంధించిన రశీదును తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులకు మండల వ్యవసాయాధికారి రాజలింగం ఆదేశించారు. మండలకేంద్రంలోని పురుగు మందులు, ఎరువుల (మిగతా 8లో..)



కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న ఎస్పీ, బ్యాంకు అధికారులు

ప్రాణ త్యాగం చేసిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీప రాజేష్‌చంద్ర అన్నారు. సోమవారం రోడ్డుప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుళ్ల రవికుమార్, బుచ్చయ్య కుటుంబాలకు ఎస్‌బీఐ పోలీసుసాలరీ ప్యాకేజ్ కింద అందించిన రూ.కోటి ఇన్సూరెన్స్ (మిగతా 8లో..)



మంజీరలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న దశ్యం (ఫైల్)

జిల్లాలో ఇసుక మాఫియా కొత్త ఎత్తుగడలకు తెరలేపింది. అక్రమంగా ఇసుక తరలించే టిప్పర్లను అందరి కళ్లు కప్పి వాహనాలకు ప్రత్యేక పైలెట్ కార్లను ఏర్పాటుచేసుకుని జిల్లా సరిహద్దులు దాటిస్తూ పొరుగు రాష్ట్రాల్లో దందాను సాగిస్తోంది. మంజీరా పరివాహక ప్రాంతాల్లో, రీచుల నుంచి అనుమతులు లేకుండా భారీ టిప్పర్లలో ఓవర్ లోడుతో ఇసుకను మహారాష్ట్ర, కర్ణాటకలకు తరలిస్తూ ఇసుకాసారులు సొమ్ము చేసుకోవడమే కాకుండా రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్నారు.

ఇసుక మాఫియా కొత్త ఎత్తుగడలు

- మంజీరాలో ఇసుక తవ్వకాలు
- ప్రైవేట్ పైలెట్‌తో తరలింపు
- ఇసుక రవాణాకు ఆటంకం కలగకుండా కార్లతో పైలెటింగ్
- కొత్త తరహాలో మహారాష్ట్రకు తరలిస్తున్న వైనం
- ఇటీవల మహారాష్ట్రకు తరలిస్తుండగా ఇటుక టిప్పర్లను పట్టుకున్న పోలీసులు
- ఇసుక తరలిస్తున్న వారంతా కర్నాటక వాసులే
- ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమ దందా

కామారెడ్డి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అక్రమ ఇసుకరవాణాను అధికారులు, పోలీసులు కట్టడి చేస్తున్నా ఇసుకమాఫియా కొత్తమార్గాలు ఎంచుకుంటోంది. ఇరు జిల్లాల మీదుగా టిప్పర్లలో అక్రమంగా ఇసుకను తరలించేందుకు ఎవరూ అడ్డుకోకుండా ఇసుక మాఫియా టిప్పర్లకు ప్రైవేటు ఎస్కార్ట్‌ను ఏర్పాటు మరి జిల్లాలను దాటిస్తూ పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇటీవల మద్నూర్ మండలంలో రెండు ప్రైవేట్ కార్ల ఎస్కార్ట్‌తో ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను కామారెడ్డి పోలీసులు పట్టుకోవడం ఇందుకు నిదర్శనం.

మంజీరా నుంచి అక్రమంగా తరలింపు

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలో మంజీరా నది ఉంది. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలతో మంజీరాలో ఇసుక మేటలు భారీగానే వెలిశాయి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుకను ఉచితంగా ఇస్తోంది. అయితే మంజీరాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుకను తవ్వుకునేందుకు స్థానిక రెవిన్యూశాఖ అనుమతులిస్తోంది. అదేవిధంగా నిజామాబాద్ జిల్లాలోని పోతంగల్ మంజీరా నదిలో పలు ప్రభుత్వ పనులకు, ఇతర ప్రైవేటు అవసరాల కోసం ఇసుక రీచులకు అనుమతులు ఇచ్చారు. ఇదే అదునుగా భావిస్తూ కొందరు ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్ల పేరిట అనుమతులు లేకుండా భారీ లోడ్లలో అక్రమంగా ఇసుకను పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



పోలీసులు పట్టుకున్న టిప్పర్, పైలెట్ కారు (ఫైల్)

ప్రైవేటు పైలెట్ కార్లతో..

ఇసుక మాఫియా కొత్త పద్ధతులను ఎంచుకుంటూ అక్రమంగా ఇసుకను పొరుగు రాష్ట్రాలకు (మిగతా 8లో..)



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థుల మేధాశక్తిని వెలికి తీసేందుకే

వైజ్ఞానిక ప్రదర్శనలు

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్
- మండలకేంద్రంలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

సదాశివనగర్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మేధాశక్తిని వెలికి తీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం సదాశివనగర్ మండల కేంద్రంలోని స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాలలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలను వారు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ విద్యార్థులు కొత్త ఆవిష్కరణల పట్ల అవగాహన పెంచుకుంటే టెక్నాలజీ పట్ల ఆసక్తి పెరిగి భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల మనోవికాసానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. అనంతరం ఎంఈవో యోసఫ్ మాట్లాడుతూ జిల్లాలోని 350 పాఠశాలల నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొనగా వారు 650 ప్రాజెక్టులు నిర్వహించారని, ఇన్‌స్పైర్ 90, సైన్స్‌ఫెయిర్ 540 నిర్వహించగా ఇందులో 24ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇందులో జూనియర్ విభాగానికి 250, సీనియర్ విభాగానికి 400మంది పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రాజు, సైన్స్ అధికారి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

రుణాల పంపిణీకి ఏర్పాట్లు

కామారెడ్డిటౌన్,నవంబరు24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల వారిగా వడ్డీలేని రుణాల పంపిణీకి ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, సీఎస్ రామకృష్ణరావు ఇతర అధికారులతో కలిసి నిర్వహించిన వీసీలో మాట్లాడారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్నినియోజకవర్గాలలో మంగళవారం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు విక్టర్, మదుమోహన్, డీఆర్‌డీఓ సురేందర్, డీపీఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

నసురుల్లాబాద్: ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఆదేశించారు. సోమవారం మండలంలోని బొప్పాస్‌పల్లి గ్రామంలో (మిగతా 8లో..)



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కలెక్టర్

క్రైం సమాచారం

ఆర్టీసీ బస్సులో నుంచి పడి వ్యక్తి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భిక్కనూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బస్సు డ్రైవర్ ఎలాంటి సూచనలు చేయకుండా వేగంగా వెళ్తున్న బస్సు డోరు తీయడంతో ఒక వ్యక్తి బస్సులో నుంచి కింద పడి తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన భిక్కనూరు మండలంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన అంశెట్టి స్వామి (42) తన భార్య మమత, తండ్రి రాజన్నతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ పని ముగించుకుని తిరిగి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు (టీఎస్ 01 జడ్ 0172) లో ఆదిలాబాద్‌కు వెళ్తుండగా భిక్కనూరు మండలంలోని జంగంపల్లి సమీపానికి రాగానే వాంటింగ్స్ వస్తున్నట్లు ఉంది బస్సు కొద్దిగా ఆపాలని బస్సు డ్రైవర్‌ను కోరాడు. కానీ డ్రైవర్ బస్సు ఆపకుండా ఎలాంటి సూచనలు చేయకుండానే వేగంగా వెళ్తున్న బస్సు డోర్ ఓపెన్ చేయడంతో బస్సులో నుంచి అతడు ప్రమాదవశాత్తు కింద పడగా అదే బస్సు వెనుక టైర్లు ఎక్కడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో బస్సులో ఉన్న అతడి భార్య అతడి మృతదేహంపై పడి కొద్దిసేపు బస్సు ఆపి ఉంటే ఈ ఘోరం జరిగేది కాదని బోరున విలపించారు. ఈ ప్రమాద విషయం తెలుసుకున్న భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకుని బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

భిక్కనూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్షతో పాటుగా జరిమానా విధించినట్లు భిక్నుఊరు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా శామ్నాపూర్‌కు చెందిన పెండెల ధన్‌రాజ్ భిక్కనూరులో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడగా అతడిని కోర్టులో ప్రవేశ పెట్టామన్నారు. ఈ మేరకు జిల్లా సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ టీ. చంద్రశేఖర్ ధన్‌రాజ్‌కు ఒకరోజు జైలు శిక్షతో పాటుగా రూ.1000ల జరిమానా విధించామన్నారు.

ఇసుక లారీ పట్టివేత

మెండోరా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుస్సాపూర్ శివారాలులో ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. ఈ సందర్భంగా వేకువ జామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మోర్తాడ్ గ్రామానికి చెందిన దేవర్ల ఎల్లయ్య ఎటువంటి అనుమతి లేకుండా కాశేశ్వరం నుంచి ఇసుకను తీసుకొచ్చి ఆర్మూర్ చుట్టు ప్రక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నాడని ఇదే క్రమంలో బుస్సాపూర్ శివారులో అక్రమ ఇసుక లారీని పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

మెండోరా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెల్గటూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు షేక్ మస్తాన్ (59) కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడని. పొలంలో మోటార్ స్టార్ట్ చేయడానికి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మోటార్ స్టార్టర్ డబ్బాకి వచ్చే వైరు తెగి పడటంతో స్టార్టర్ పైన వైరు పడటంతో మస్తాన్ విద్యాదాఘాతంతో అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి కొడుకు షేక్ సలీం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తన తండ్రి చనిపోయాడని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తెలిపారు.

వడ్ల కుప్పపై నుంచి పడి వ్యక్తికి గాయాలు


గాయపడిన సల్మాన్

పెద్ద కొడప్‌గల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రహదారిపై ఆరబెట్టిన ధాన్యం కుప్పను గమనించక వ్యక్తి మోటార్ సైకిల్ పై నుండి పడిపోవటంతో గాయాల పాలయిన ఘటన 161వ జాతీయ రహదారిపై జగన్నాథ్‌పల్లి శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మద్నూర్ మండలం శేఖాపూర్ గ్రామానికి చెందిన సల్మాన్ వ్యక్తిగత పనిమీద పెద్దకొడప్‌గల్ మండల కేంద్రానికి వస్తుండగా జగన్నాథ్‌పల్లి శివారులో 161వ జాతీయ రహదారిపై ధాన్యం ఆరబెట్టి వాటిని కుప్ప లుగా పేర్చారు. సాయంత్రం సమయంలో పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రానికి సల్మాన్ మోటార్ సైకిల్‌పై వస్తుండగా ధాన్యం కుప్పపై నుంచి పడటంతో ప్రమాదానికి గురై తీవ్రగాయాల య్యాయి. దీంతో ఈ విషయం స్థానికులు 108 అంబులెన్స్‌కు సమా చారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు.

ముప్కాల్ ఎస్సైగా కిరణ్



ముప్కాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ నూతన ఎస్సైగా కే.కిరణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై రజనీకాంత్ రెడ్డి ఆర్మూర్‌కు బదిలీ పై వెళ్లగా నిజామాబాద్ 3 టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న కిరణ్ ముప్కాల్ ఎస్సైగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని, అందరి సహకారంతో చట్టం పరిధిలో పనిచేస్తానంటు తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

ఇందల్వాయి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మలయ్య గుడిలో దొంగతనం చేసిన కొత్త సురేష్ అనే వ్యక్తిని పోలీసులు పట్టుకొని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ వినోద్ తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నల్లవెల్లి గ్రామంలో తిర్మలయ్య ఆలయంలో గత నెలలో అదే గ్రామానికి చెందిన కొత్త సురేష్ ఆలయ తలుపులు పగలగొట్టి లోనికి ప్రవేశించి అమ్మవారి మెడలో ఉన్న ఒకటిన్నర గ్రాముల బంగారు పుస్తెలు, హుండీలో ఉన్న రూ.1500 నగదును దొంగతనం చేసి పారిపోయినట్లు తెలిపారు. పోలీసుల తనిఖీల్లో భాగంగా లింగాపూర్ స్టేజి వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా నింధితుడు సురేష్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఆరున్నర గ్రాముల బంగారు పుస్తెలు, ఒక సెల్‌ఫోన్, వెయ్యి రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నగరంలో తాళం వేసిన ఇంట్లో చోరీ

సుభాష్‌నగర్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): నగరంలో తాళం వేసిన ఇంట్లో చోరి జరిగింది. 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబీబ్‌నగర్‌కు చెందిన సాకిబ్ అర్సాలన్ తన కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యానికి ముథోల్ వెళ్లింది. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దుండగులు 5గ్రాముల బంగారం, 34 గ్రాముల వెండి, కొంత నగదును అపహరించినట్లు 1వ టౌన్ ఎస్ఐ సుమలత తెలిపారు.

వాహనాల తనిఖీ

రెంజల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వాహనదారుడు వాహనానికి సంబంధించిన సరైన పత్రాలతో పాటు హెల్మెట్ తప్పకుండా వాడాలని రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల తనిఖీలో భాగంగా రెంజల్ గ్రామానికి చెందిన మహ్మద్ తాహెర్ అనే వాహనదారుడు తన ద్విచక్ర వాహనంపై ఉన్న 26చాలన్లు పెండింగ్‌లో ఉండడంతో రూ.4240 పెండింగ్ చాలాన్ చెల్లించి వాహనాన్ని అప్పగించడం జరిగిందని ఆయన అన్నారు.

మనిషికి చదువే ఆయుధం

- పేదలకు అంతర్జాతీయ స్థాయి విద్యనందించే ఏకైక రాష్ట్రం తెలంగాణ
- పీఎస్ఆర్ నగర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి భూమిపూజ
- రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పోతంగల్ మండలంలోని పీఎస్ఆర్‌నగర్ గ్రామంలో సోమవారం 200కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ముఖ్య ఉద్దేశం పేదలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే లక్ష్యమన్నారు. ప్రతీ మనిషికి చదువే ఆయుధమని చదువుతో అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చాన్నారు. బాన్సువాడ నియోజకవర్గ విద్యారంగంలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపానన్నారు. గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు కస్తూర్బా గాంధీ, ఆహారశాస్త్ర సాంకేతిక కళాశాల, నర్సింగ్ కళాశాల, జూనియర్ కళాశాలలు నిర్మించామన్నారు. పేదలకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఉన్నవాళ్లు కార్పొరేట్ విద్యనభ్యసించేందుకు పట్టణ ప్రాంతాలకు తరలివెళ్తారని, పేదలు కార్పొరేట్ స్థాయి విద్యను స్థానికంగా అందుకునేందుకే కళాశాలలు, పాఠశాలలు నెలకొల్పినట్లు ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ తరానికి తనవంతు సాయంగా విద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరి చదివించాలని సూచించారు.

● విద్యాలయాలు ఆధునిక దేవాలయాలు: ఎంపీ సురేష్ షెట్కార్

విద్యాలయాలు ఆధునిక దేవాలయాలని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గం విద్యారంగంలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన విద్యను అందించేందుకు పోచారం చేసిన కృషి ఎంతగానో ఉందన్నారు., ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవోలు చందర్, విష్ణు, నాయకులు ఏజాజ్‌ఖాన్, శంకర్ పటేల్, మనోహర్, బర్ల మధు, నాగరాజు గౌడ్, చాకూర్ గంగాధర్, జగన్, సాయినాథ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కోనసముందర్ సొసైటీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

కమ్మర్‌పల్లి, నవంబరు 24: (ఆంధ్రజ్యోతి) మండలంలోని కోనాసముందర్ సహకార సంఘం పాలకవర్గ సోమవారం బాధ్యతలు స్వీకరించింది. పదవికాలం పూర్తిఅయినవెంటనే తమ పదవులకు దూరంగా ఉంటు వస్తున్న పాలకవర్గ సభ్యులు సోమవారం తిరిగి బాధ్యతులు స్వీకరించారు. పాలకవర్గం పదవీ కాలం పొడగిస్తు హైకోర్టు ఉత్తర్వులు వెలువడడంతో డిసివో ఉత్తర్యుల మెరకు సొసైటి చైర్మన్ సామ బాపురెడ్డి వైస్ చైర్మన్ అకుల రాజన్న డైరక్టర్‌లు సోమవారం తిరిగి బాధ్యతులు స్వీకరించారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో సోమవారం పాలకవర్గ సభ్యులు మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం డీసీవో ఇచ్చిన ఆదేశాల మేరకు పీఏసీఎస్ చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, పాలక వర్గ సభ్యులు బి. మహిపాల్, ముత్యాల లక్ష్మణ్, ఇతర పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. బీసీవో ఉత్తర్వులను కార్యదర్శి కాశీరాంకు అందజేశారు.

నాణ్యమైన చీరెలు మహిళలకు అందిస్తున్నాం


ఇనాయత్‌నగర్‌లో చీరెలు పంపిణీ చేస్తున్న మానాల మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) గత ప్రభుత్వ హయాంలో మాదిరి నాసీరకం చీరెలు కాదు మహిళలు మెచ్చే విధంగా నాణ్యతతో కూడిన చీరెలను కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్నదని రాష్ట్ర సహకార చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లి మండలం ఇనాయత్ నగర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళ శక్తిచీరెలను ఆయన పంపిణిచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నాణ్యత లేని చీరెలు పంచారని కానీ ప్రస్తుతం నాణ్యతగల చీరెలు అందిస్తున్నామన్నారు. చీరెలు పంపిణిచేస్తున్నామని చెప్పిన నాటినుండి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చీరెలపంపిణి చేస్తున్నదని చెప్పడం సరకాదన్నారు. ఇందిరాగాంధీ జన్మదినం రోజునుండె ప్రారంభించిందని కాని ఎన్నికల షెడ్యూల్ మూలంగా కొంత జాప్యం జరిగిందని అప్పటికి ఎన్నికల ప్రకటన వెలువడలేదని అన్నారు.

స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుస్తాం


ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బోధన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్ని స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని బోధన్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సుదర్శన్ రెడ్డిని సోమవారం బోధన్ మున్సిపల్ తాజా, మాజీ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డిలు ఘనంగా సన్మానించారు. మర్యాద పూర్వకంగా వారిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా బోధన్ రాజకీయ అంశాలపై చర్చించినట్లు శరత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో ఆరు గ్యారంటీల అమలుకు ప్రత్యేక సలహాదారులుగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాతో పాటు రాష్ట్రంలో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

రుద్రూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్, సులేమార్ నగర్, రుద్రూర్ గ్రామాలలో ఐకేపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఈ చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారోజి గంగారాం, ఓబీసీ జనరల్ సెక్రెటరీ పట్ల సురేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు దత్తాత్రి, కుర్మాజీ సాయిలు, కృష్ణ, సులేమాన్ నగర్ మాజీ ఎంపీటీసీ షేక్ గౌస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సొంతింటి కల నెరవేర్చిన సీఎం


గృహ ప్రవేశం నిర్వహిస్తున్న దృశ్యం

భీమ్‌గల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. మండలంలోని లింగాపూర్, ముచ్కూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు వచ్చి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల, బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు చేపట్టడానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఏపీవో నర్సయ్య, పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవం

వేల్పూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నమూన గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ జారీ చేశామని నామినేషన్ స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోటీ చేసే అభ్యర్థులు తుది జాబితా ప్రకటన కార్యక్రమాన్ని నిర్వహించామని ఎన్నికల అధికారి హెచ్‌ఎం రాజన్న తెలిపారు.

అగ్గి మల్లన్న జాతర ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో సోమవారం అగ్గి మల్లన్న జాతర ఉత్సవాలు ప్రారంభమైనట్లు యాదవ సంఘం నాయకులు నందుయాదవ్ తెలిపారు. మంగళవారం పల్లకి సేవా ఊరేగింపు, బుధవారం సిరి రథోత్సవం ఊరేగింపు జాతర, అన్నదాన కార్యక్రమం, గురువారం మల్లన్న ఆలయం వద్ద అగ్నిగుండం కార్యక్రమాలు జరుగుతాయని యాదవ సంఘం సభ్యులు తెలిపారు.

పిప్రి పాఠశాలకు డెస్క్ బెంచీల వితరణ

ఆర్మూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత ఏనుగు దయానంద్‌రెడ్డి 15 డెస్క్ బెంచీలను విరాళంగా అందజేశారు. అదేవిధంగా పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం సుమారు 50వేల రూపాయలు విలువ చేసే క్రీడా పరికరాలు, దుస్తువులను సోమవారం అందజేశారు. పాఠశాలకు డెస్క్ బెంచీలు, క్రీడా సామాగ్రిని అందజేసిన విద్యాదాత, క్రీడాదాత ఏనుగు దయానంద్ రెడ్డికి ప్రధానోపాధ్యాయుడు నవీన్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నర్సారెడ్డి, రాములు, శ్రీనివాస్, ప్రసాద్, పీఈటీ గంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొర్లికొండ పాఠశాలకు..

జక్రాన్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం దాత చిట్టాపూర్ దయానంద్‌రెడ్డి డెస్క్ బెంచీలను వితరణ చేశారు. సుమారు రెండు లక్షల రూపాయల విలువ చేసే 30 డెస్క్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా దాత దయానంద్‌రెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, జైడి రాజ్‌కుమార్, చిట్టాపూర్ గణేష్, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగమోహన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

జక్రాన్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాల మేరకు జక్రాన్‌పల్లిలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన 12 మంది లబ్దిదారులకు 2లక్షల 32వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, అర్గుల్ సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలి

ఆర్మూర్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో విలే కరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్మూర్ డివిజన్‌లో సొంత ఇళ్లు లేని నిరుపేదలు అనేక ఏళ్లుగా ఇంటి కిరాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా పూర్తయిన డబుల్ బెడ్‌రూంలను వెంటనే కేటాయించాలన్నారు. సమావేశంలో కొండ గంగాధర్, రఫీక్, సాయి లు పాల్గొన్నారు.

ప్రమాద హెచ్చరిక పరికరాల ప్రదర్శన

సాలూర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం విభాగంలో సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రమాద హెచ్చరిక పరికరాలను తయారు చేసి సోమవారం పాఠశాలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా 3వ వ్యక్తి ప్రమేయం లేకుండా క్షతగాత్రులకు సెన్సార్ సహకారంతో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలను కాపాడుతుంది. ఉపాధ్యాయులు సంతోష్ కుమార్ యాదవ్, విఠల్ కాంబ్లే, జ్యోత్స్న, విజయ్, లక్ష్మిలు గైడ్‌గా వ్యవహరించారు.

హైకోర్టు ఆదేశాలతో సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇమామ్ బేగ్

రెంజల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల క్రితం ప్రభుత్వం సొసైటీ చైర్మన్‌ల పదవికాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించడంతో ప్రత్యేక అధికారులు సహకార సంఘం బాధ్యతలు నిర్వహించారు. తమ పదవి కాలం ముగిసిన చైర్మన్‌లు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు తీర్పు చైర్మన్‌లకు అనుకూలంగా రావడంతో సహకార సంఘం చైర్మన్‌లతో పాటు సభ్యులందరు పాలకవర్గ బాధ్యతలు చేపట్టాలని హైకోర్టు ఆదేశించడంతో సోమవారం నీలా సొసైటీ చైర్మన్‌గా ఇమామ్ బేగ్ బాధ్యతలు చేపట్టారు. పదవి బాధ్యతలు చేపట్టిన చైర్మన్ ఇమామ్ బేగ్‌కు స్థానిక నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో రాందాస్ ఉన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం ఆపాలి

జక్రాన్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం ఆపాలని తెలంగాణ పంచాయితీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు డిమాండ్ చేశారు. సోమవారం జక్రాన్‌పల్లిలో కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో దాసు మాట్లాడుతూ కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి పనిచేస్తుంటే ఉపాధి భద్రత కల్పించి, జీవన ప్రమాణాలను పెంచవల్సిన కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుదారుల మెప్పుల కోసం 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి మరణ శాసనం విధించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు సొప్పరి గంగాధర్, ఐఎఫ్‌టీయు జిల్లా కమిటి సభ్యులు భారతి, పంచాయితీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజన్న, శేఖర్, లక్ష్మి, బుచ్చవ్వ, స్వరూప, రేణుక, రాజగంగు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఎమ్మెల్యే

● టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్

కమ్మర్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర మహిళలకు నాణ్యమైన చీరెలు అందివ్వాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరా మహిళా శక్తి పేర చీరెల పంపిణి కార్యక్రమాన్ని చేపడితే అదితట్టుకోలేక బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలను ముఖ్యంగా మహిళలను తప్పుదోవ పట్టించేవిదంగా మాడ్లాడుతున్నారని టీపిసిస అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ మెరకు ఆయన మాటల్ని ఖండించారు. బుతుకమ్మ చీరెల పేర మీరు అవినీతికి పాల్పడిన విషయం రాష్ట్ర ప్రజానికానికి, మహిళ లోకానికి తెలియంది కాదన్నారు.

రాజీవ్‌నగర్ తండాలో భోగ్ బండార్


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు హోమంతో సంప్రదాయ బద్దంగా నిర్వహించే భోగ్‌బండార్‌ను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధుల గుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై సోమవారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. సిద్దేశ్వరునికి ఎంతో ప్రీతికరమైన ఆరుద్ర నక్షత్రం సోమవారం రావడం వలన సకల దోషాలు తొలగిపోయి కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చేసి సిద్దేశ్వరుని దర్శించుకుని నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో పాల్గొన్నారు.


ఆర్మూర్ చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

గంగపుత్రుల అభ్యున్నతికి కృషి

» ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంగపుత్రుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువులో సబ్సిడి చేపపిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ గంగపుత్రుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడిపై చేపపిల్లల పంపిణీ కార్యక్రమం చేపడుతుందన్నారు. గతంలో ప్రభుత్వాలు గంగపుత్రుల సౌకర్యార్థం సబ్సిడీపై వాహనాలను అందజేసిందన్నారు. చెరువులు కబ్జాకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. చెరువులు గంగపుత్రుల జీవనోపాదికే కాకుండా అన్ని వర్గాల వారికి ఉపయోగపడుతాయన్నారు. చెరువులో నీరు కలుషితం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, పోల్కం వేణు, కలిగోట గంగాధర్, భరత్, ఉదయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ కావలెను

ముప్కాల్ , నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలో గల మైనార్టీ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ జూనియర్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ చందన ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీతో పాటు అనుభవం కలిగిన అభ్యర్థులు ఈ నెల 27లోగా బాల్కొండలోని అత్తర్‌గల్లీలో గల మైనార్టీ గురుకుల కళాశాల సంప్రదించాలని తెలిపారు.

'ఇందిరమ్మ' చీరలను అందించాలి

● జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఎడపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలను అందించాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఎడపల్లి మండల కేంద్రంలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఎడపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి చీరలను అందించాలని, ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా, సజావుగా జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ దత్తాత్రి తదితరులు ఉన్నారు.

పెండింగ్ పనులు ప్రారంభం

ఏర్గట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యతి) : మండల కేంద్రంలోని కేజీబీవీలలో పెండింగ్ పనులకు విద్యాశాఖ సమగ్ర శిక్ష పథకంలో భాగంగా రూ. 11లక్షలు మంజూరీ కాగా ఆ పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు వీడీసీ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేజీబీవి పాఠశాలకు నిధులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్ళగా వెంటనే నిధులు మంజూరీ చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, ముస్కు మోహన్, గడ్డం జీవన్, బద్ధం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, దండెవోయిన సాయికుమార్, సుదనవేణి శ్రీనివాస్ గౌడ్, వీడీసీ క్యాషియర్ జుంగల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభం

కోటగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హంగర్గ, హంగర్గ ఫారం గ్రామాలలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాలను బోధన్ సీడీపీవో పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు గ్రామాలలో 12 లక్షల వ్యయంతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించడం జరిగిందన్నారు. సొంత భవనం లేక చిన్నారులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొమురవ్వ, నాయకులు గంగాధర్, ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రగ్గుల పంపిణీ

కోటగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులు రగ్గులు, దుప్పట్లను పంపిణీ చేశారు. చలి నుంచి విద్యార్థులను కాపాడేందుకు తమవంతు బాధ్యతగా దుప్పట్లు అందజేసినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రుద్రూర్ ఏడీఈ తోట రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు వెంకటేశం, ఏఈ బుజ్జిబాబు, హస్టల్ వార్డెన్ కల్పలత పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ల అప్పగింత

ఆర్మూర్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లా ఎస్‌హెచ్‌వొ సత్యనారయణ సొమవారం నాలుగురు బాధితులకు సెల్‌ఫోన్‌లను అందజేశారు. ఇటీవల స్టేషన్ పరిధిలో దేవేంద్ర, రాదకృష్ణ,చిన్నగంగారాం, హరీష్‌లు తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టు కోవడతో ఈసీఐఆర్ పోర్టల్ ద్వార సెకరించి బాధితులకు అందజేశారు.

శ్లోకాల పోటీల్లో చిన్నారుల సత్తా



చిన్నారులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ వ్యాయామశాలలో ఆదివారం రాత్రి నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీలలో చిన్నారులు సత్తా చాటారు. చిన్నారులు అనర్గలంగా శ్లోకంతో పాటు అర్థాన్ని కూడా వివరించి చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి న్యాయవాది లక్ష్మీనారాయణ మూర్తి బహుమతులను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హరినాథ్ రావు, శంకర్, సంతోష్, గిరిజాగాయత్రి, పవిత్ర తదితరులున్నారు.

అభ్యాస దీపిక పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

మద్నూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయంలో విద్యార్థులకు అభ్యాస దీపిక పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ముద్రించిన అభ్యాస దీపిక పఠన పుస్తకాలను సోమవారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఉత్తీర్ణతకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని సూచించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు అభ్యాసదీపిక పుస్తకాలను బాగా వినియోగించుకోవాలని కోరారు. గణితం, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రాల అభ్యాస దీపిక పుస్తకాలను బాగా శ్రద్ధతో చదవాలని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత డా.బి వెంకట్, ఉపాధ్యాయులు జి.వేణుగోపాల్, జే.గణేశ్, బి.సంతోశ్, జి.రాము, నరహరి, యస్.శంకర్, శివాజీ, పి.శంకర్, అశోక్, రాచప్ప, నాగరాజు, గంగా ప్రసాద్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ మండలానికి 9 వేల చీరలు



చీరలు తీసుకోవడానికి వచ్చిన మహిళా సంఘాల సభ్యులు

మద్నూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూనిఫామ్ పేరుతో పొదుపు సంఘాల మహిళలకు ప్రస్తుతం అందజేస్తున్న ఇందిరా మహిళా శక్తి చీరలను ముందుగా మహిళా సంఘాలలో ఉన్న సభ్యులకు అందజేస్తున్నట్లు ఏపీఎం జగదీష్ తెలిపారు. తరువాత 18 ఏళ్లు నిండిన వారందరికీ పంపిణీ చేసేలా జాబితా తయారుచేస్తున్నామన్నారు. ప్రస్తుతానికి ఉమ్మడి మద్నూర్ మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు 9 వేల చీరలు వచ్చాయని, అర్హులైన మరో 16 వేల మహిళల కోసం జాబితా తయారుచేసి ప్రభుత్వానికి పంపించామని వెల్లడించారు. ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలందరికీ చీరల పంపిణీ చేసేలా చర్యలు చేపట్టిందన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

మద్నూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లికార్జున్‌కు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిపటేల్ ఆధ్వర్యంలో మద్నూర్ మండల నాయకులు సన్మానించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ పార్టీ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ సాయిపటేల్ మాట్లాడుతూ.. డీసీసీగా ఎంపికైన మల్లికార్జున్ ఆధ్వర్యంలో పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మద్నూర్ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, ఆలయ చైర్మన్ రాంపటేల్, నాయకులు హన్మాండ్లు స్వామి, సంగాయప్ప, సింగిల్ విండో మాజీ చైర్మన్ గంగాధర్, మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ పాల్గొన్నారు.

ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలవాలి

▸▸ జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

మద్నూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజార్టీ స్థానాలు గెలవాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సూచించారు. సోమవారం జరిగిన మద్నూర్ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడాలన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. క్షేత్రస్థాయిలో నెరవేరని కాంగ్రెస్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు రాష్ట్ర పునర్నిర్మాణానికి అవసరమైన పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బస్సీపటేల్, కార్యదర్శి గోవింద్, మాజీ సర్పంచులు సురేష్, గఫార్, నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఒళ్లంత 'చలి'ంత

▸▸ రోజురోజుకూ పెరుగుతున్న చలి
▸▸ జలుబు, జ్వరాలతో ఆస్పత్రులకు క్యూ
▸▸ వృద్ధులు, చిన్నారుల పట్ల జాగ్రత్త అవసరం
▸▸ అప్రమత్తంగా ఉంటేనే ఆరోగ్యం



రోగులతో కిటకిటలాడుతున్న మద్నూర్ సీహెచ్‌సీ

మద్నూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఉదయపు పనులకు వెళ్లేవారు, పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు గజగజ వణుకుతూ చదువుకునేందుకు వెళ్తున్నారు. తెల్లవారుజామున చలిగాలులకు ప్రజలు విలవిల్లాడుతున్నారు. చాలా మంది ప్రజలు జలుబు, ఒళ్లు నొప్పులు, జ్వరాలతో ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. కాగా చలికాలం వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. రోజురోజుకు చలి తీవ్రత లు పెరుగుతున్న నేపథ్యంలో పలు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెబుతున్నారు. ప్రధానంగా ఆస్తమా, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

డోంగ్లీలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

కామారెడ్డి జిల్లాలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు ఉమ్మడి మద్నూర్ మండలంలోని డోంగ్లీలో ఈ నెలలో నమోదయ్యాయి. గత 18వ తేదీన జిల్లాలో 9.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదడంతో జనాలు గజగజ వణికిపోతున్నారు. చలిగాలులకు రక్త ప్రసరణ తగ్గి గుండెపోటు వచ్చే ప్రమాదం లేకపోలేదు. దీన్ని అధిగమించేందుకు నిత్యం కనీసం గంట పాటు వాకింగ్ చేస్తుండాలి. ఉదయం కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలి. శరీరంలో నీటి శాతాన్ని కాపాడుకునేలా చూసుకోవాలి. పిల్లలు, వృద్ధులు న్యూమోనియా బారిన పడకుండా జాగ్రత్త పడాలి. చల్లని గాలులకు మంచులో ఎక్కువసేపు ఉండొద్దు. పిల్లలకు ముందే న్యూమోనియా టీకా వేయించాలి. ఉదయం వేళల్లో బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా ముక్కు, నోటికి మాస్కులు ధరించాలి. ప్రధానంగా గుండె జబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవారు ఎండ వచ్చాకే ఉదయపు నడక ప్రారంభించాలి.

మద్నూర్ సీహెచ్‌సీలో పెరిగిన ఓపీ

మద్నూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సాధారణ రోజుల్లో ఔట్ పేషెంట్ విభాగానికి 100 నుంచి 120 మంది రోగులు వచ్చేవారు. కానీ చలికాలం నేపథ్యంలో వారి సంఖ్య రెట్టింపై ప్రస్తుతం 200 నుంచి 250 ఓపీ వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి



చలికాలంలో జలుబు, చర్మ వ్యాధులు, శ్వాసకోశ, న్యూమోనియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. జలుబును నిర్లక్ష్యం చేయవద్దు. డాక్టర్ల సూచనతో మాత్రమే యాంటీబయాటిక్ మాత్రలు వాడుకోవాలి. వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. చల్లని పదార్థాలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్‌లకు దూరంగా ఉండాలి. శరీరం పొడి బారకుండా చూసుకోవాలి. ప్రత్యేకంగా పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ కనబరచాలి.

- డా.శ్రీలేఖ, పీహెచ్‌సీ, డోంగ్లి

మద్నూర్ ఎస్ఐగా రాజు

మద్నూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల ఎస్సైగా జె.రాజును నియమిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జిల్లాలో ఎస్ఐల బదిలీ లో భాగంగా మద్నూర్ ఎస్సైగా విధుల్లో ఉన్న విజయకొండను బీబీపేటకు బదిలీచేశారు. ఆ స్థానంలో వీఆర్వోలో ఉన్న రాజును నియమించారు.

టీజీఎన్‌పీడీసీఎల్‌లో బదిలీలు

సుభాష్‌నగర్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ పరిధిలో పలువురి అధికారుల బదిలీలు చేపడుతూ వరంగల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ధర్పల్లి ఏఈగా పనిచేస్తున్న కె.నాగేశ్వర్ రావును మోర్తాడ్ ఇంచార్జ్ ఏడీఈగా బదిలీ చేశారు. ఏఈ ఎంఆర్‌టీలో పనిచేస్తున్న దుర్గా ప్రసాద్‌ను కమర్షియల్ ఏడీఈ కామారెడ్డికి బదిలీ చేశారు. ఏఈ కన్‌స్ట్రక్షన్ నిజామాబాద్‌గా పనిచేస్తున్న వినోద్‌ను నిజామాబాద్ టౌన్-3 ఇంచార్జ్ ఏడీఈగా నియమించారు. ఏఈ హెచ్‌టీ మీటర్స్ నిజామాబాద్‌లో పనిచేస్తున్న నవీన్ రెడ్డిని ఇంచార్జ్ ఏడీఈ రుద్రూర్‌గా బదిలీ చేశారు. ఏఏఈ హెచ్‌టీఎం ఆర్మూర్‌లో పనిచేస్తున్న బాలచందర్‌ను ఏడీఈ హెచ్‌టీమీటర్స్ నిజామాబాద్‌కు బదిలీ చేయగా, ఏఏఈ కన్‌స్ట్రక్షన్ ఆర్మూర్‌లో పనిచేస్తున్న వెంకట్‌నారాయణను ఏడీఈ మంథెనకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతుల విషయం కోర్టులో ఉన్నందున వీరందరికి ఇంచార్జ్‌లుగా పదోన్నతులు కల్పించారు.

కమ్మర్‌పల్లిలో తాగునీటి తంటాలు

▸▸ ఖాళీ బిందెలతో పంచాయతీ ముట్టడి
▸▸ ఎంపీడీవో ఆదేశాలతో ట్యాంకర్‌తో నీటిసరఫరా



ట్యాంకర్ ద్వారా నీటిసరఫరా చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కమ్మర్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలో గతకొంత కాలంగా త్రాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సరిపడా నీరందించడంలేదని ఆరోపిస్తూ సోమవారం ఆయా కాలనీలకు చెందిన మహిళలు గ్రామ పంచాయతీని ఖాళీబిందెలతో ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 3 నెలలుగా ఇబ్బందులు పట్టించుకోవడం లేదని, స్థానికంగా ఉన్న ఇళ్లలోని బోర్ల నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి ఉందని వాపోయారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అక్కడికి చేరుకుని విషయం ఆరాతీశారు. త్వరలోనే సమస్యను పరిష్కరించి, అందరికీ సరిపడా నీటిని అందించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాగా అప్పటివరకు ఇబ్బందులు ఎదురవ్వకుండా ట్యాంకర్ ద్వార నీటిని అందించాలని ఆదేశించారు. దీంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు. ఎంపీడీవో ఆదేశాలతో గ్రామపంచాయతీ అధికారులు వెంటనే ట్యాంకర్ ద్వారా కాలనీవాసులకు నీటిని సరఫరా చేశారు. బోరు సమస్య పరిష్కరించేవరకు ట్యాంకర్ ద్వారా నీరందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీవాసులతో పాటు మాజీ ఎంపీటీసీ మైలారం సుధాకర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కుంటికంటి నరేందర్ ఉన్నారు.

తెలంగాణ వర్సిటీ చీఫ్ వార్డెన్‌గా ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి



నియామకపత్రం అందజేస్తున్న రిజిస్ట్రార్

సుభాష్‌నగర్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం చీఫ్ వార్డెన్‌గా ప్రొఫెసర్ కే.రవీందర్‌రెడ్డిని నియమించారు. డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో సోమవారం రిజిస్ట్రార్ యాదగిరి రవీందర్‌రెడ్డికి నియామక ఉత్తర్వులను అందించారు. టీయూలో అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన్ను చీఫ్ వార్డెన్‌గా నియమించడంపట్ల తోటి అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో సైతం చీఫ్ వార్డెన్‌గా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా అనేక అకాడమిక్ పదవులు సమర్థవంతంగా నిర్వహించారు. తనపై నమ్మకం ఉంచి చీఫ్ వార్డెన్‌గా నియ మించేందుకు కృషి చేసిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ పరీక్షలు ప్రశాంతం

తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలు ప్ర శాంతంగా జరిగాయి. 4వ రోజు పరీక్షలకు 420 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 389 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 4844 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 4677 మంది హాజరయ్యారు. 167 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చక్రపాణి వివరించారు.

అయ్యప్పమాల ధరించిన ట్రాన్స్‌జెండర్లు



అయ్యప్పమాల వేసుకున్న ట్రాన్స్‌జెండర్లు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కఠినమైన నియమ నిబంధనలతో 41 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించే అయ్యప్ప దీక్షను నిజామాబాద్ జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్లు స్వీకరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో ట్రాన్స్‌జెండర్లు ప్రజ్ఞ, ప్రియకు ఆలయ అర్చకులు రమేష్ శర్మ మాలధారణ చేశారు. అయ్యప్ప భక్తుల అయ్యప్ప నామస్మరణల నడుమ ట్రాన్స్‌జెండర్లు మాలను స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతంలో పలు దీక్షలు స్వీకరించి భక్తిప్రపత్తులతో కొలిచామని అన్నారు. అయ్యప్ప దీక్షను స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న స్కూల్ బస్సు

మోపాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంజర్ గ్రామ సమీపంలో సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూల్ బస్సులో ఉన్న విద్యార్థులకు స్వల్పంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే స్కూల్ యాజమాన్యం స్వల్పంగా గాయపడిన విద్యార్థులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై మోపాల్ పోలీసులను అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

చెరువులో చేపపిల్లల విడుదల



చేప పిల్లలను వదులుతున్న అధికారులు, నాయకులు

సాలూర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని సాలూర, జాడి జమాల్‌పూర్, సాలంపాడ్, కుమ్మన్‌పల్లి గ్రామాలలోని చెరువుల్లో సోమవారం అధికారులు చేపపిల్లలను విడుదల చేశారు. సాలూర మండల ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శశిభూషణ్, నాయకులు, ప్రజాప్రతినిధులు, బోయ కులస్థులతో కలిసి చేప పిల్లలను వదిలారు. మత్స్య అభివృద్ధి పథకం 2025-26 సంవత్సరానికి గాను బోయ కులస్థులకు 100 శాతం సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. చెరువులలో చేప పిల్లలను విడుదల చేసిన సందర్భంగా మత్స్యకారులకు అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సాలూర చెరువులో 2లక్షల 82వేల 600, జాడి గ్రామంలోని చెరువులో 48,930, సాలంపాడ్ గ్రామంలోని చెరువులో 73,800, కుమ్మన్‌పల్లి గ్రామంలోని చెరువులో 44,520, ఫత్తేపూర్ గ్రామంలోని చెరువులో 28,200 చేప పిల్లలను వదిలినట్లు మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలూర పీఏసీఎస్ చైర్మన్ అల్లె జనార్ధన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇల్తెపు శంకర్, నాగరాజు, సంజీవ్, డైరెక్టర్ భూమయ్య, వెంకట్ పటేల్, సురేష్ పటేల్, బోయ కులస్థులు, మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్స్ నరేందర్, జానకి, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదల ఇంట్లో ఆడబిడ్డ పెళ్లి జరిగితే ప్రభుత్వం తరఫున అండగా ఉండాలని కేసీఆర్ ఆలోచనలన నుంచి పుట్టినవే షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం బాల్కొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముప్కాల్ మండలానికి సంబంధించి 24 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, బీసీ పేద వర్గాలకు ఈ పథకాన్ని వర్తింపజేసి రూ.50వేలతో మొదలు పెట్టి రూ.లక్ష 116 రూపాయల వరకు గత ప్రభుత్వంలో అందజేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి పార్టీకి ఓటువేసి ప్రజలు గెలిపించారు. అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు అవుతున్నా తులం బంగారం ఇస్తానన్న హామీ ఇంకా నెరవేర్చలేదన్నారు. హామీలు సక్రమంగా అమలు చేయని కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చేపపిల్లలను అందించాలి..

ముప్కాల్: ఉచిత చేపపిల్లల పథకాన్ని కోతలు లేకుండా అందించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బాల్కొండ మండలం నాగాపూర్ ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో ఉచిత చేపపిల్లలను వదిలారు. అనంతరం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉచితంగా చేపపిల్లలను, రొయ్యలను సరఫరా చేసిందన్నారు. బాల్కొండ నియోజకవర్గానికి గత ప్రభుత్వం కోటి 74 లక్షల చేపపిల్లలు, 68 లక్షల రొయ్య పిల్లలు, సుమారు రూ.3.70 కోట్లతో సరఫరా చేసిందన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు 70 లక్షల విలువ గల ఇన్సురెన్స్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది కోటి 74 లక్షలు చేపపిల్లలకు గాను 83 లక్షలు మాత్రమే సరఫరా చేసిందన్నారు. గత సంవత్సరం రొయ్యపిల్లలను అసలే పంపిణీ చేయలేదు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో దామోదర్, బాల్కొండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నర్సారెడ్డి, వెంకటేష్, సామ వెంకట్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై ప్రజావేదిక

బీర్కూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో సోమవారం 16వ విడత సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించారు. తనిఖీ బృందం వారు గ్రామాల వారీగా జరిగిన అక్రమాలను వేదికపై చదివి వినిపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీర్కూర్ మండలంలో రూ.2.76 కోట్ల విలువైన ఉపాధి పనులు చేపట్టారు. 5200 మందికి లక్ష 17వేల పని దినాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. పంట కాలువలు, చెరువుల పూడిక తీత, చెరువుల శిఖంలో గుట్టల్లో కందకాలు, చేపల చెరువుల తవ్వకం, పొలాల్లో ఫామ్ పండ్‌లు ఏర్పాటు, నర్సరీలు, మొక్కల పెంపకం తదితర పనులు చేపట్టినట్లు వివరించారు. పని చేయకుండా, చనిపోయిన వారి పేర్లపై డబ్బులు కాజేసినట్లు తనిఖీ బృందం సభ్యులు గుర్తించారు. పలువురు టీఏలు, ఎఫ్ఏలు బినామీ పేర్లపై డబ్బులు కాజేసినట్లు గుర్తించామన్నారు. 8 మంది జీపీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలకు ప్రిసైడింగ్ అధికారి వామన్ రావు షోకాజ్ నోటీసులు అందజేశారు. టీఏ సురేష్‌కు రూ.4073 రికవరీ పెట్టారు. ప్రిసైడింగ్ అధికారి వామన్ రావు, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనిధి, సూపరింటెండెంట్ భాను ప్రకాష్, ఎంపీఓ మెహబూబ్, ఎస్ఆర్‌పీ ప్రదీప్, ఏపీవో అక్మల్, జీపీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు, తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ బృందం వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ

పిట్లం, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంది రమ్మ మహిళా శక్తి చీరలను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నామని కంబాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ దేశాయ్ తెలిపారు. సోమవారం కంబాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంది రమ్మ మహిళా శక్తి చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు అన్ని రంగాలలో ప్రాధాన్యత కల్పిస్తూ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామపంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మద్నూర్: మహిళల ఆత్మ గౌరవానికి ప్రతీక ఇందిరా మహిళా శక్తి చీరలను డోంగ్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజానంద్ దేశాయి అన్నారు. సోమవారం కుర్ల, మదన్‌హిప్పర్గ గ్రామాల్లో మహిళా సంఘ సభ్యులకు చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. బతుకమ్మ చీరలకు బదులుగా ఇందిరా మహిళా శక్తి చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు.



కంబాపూర్‌లో మహిళలకు చీరలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



డోంగ్లి మండలంలో చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

» ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

రాజంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో సౌకర్యాలు, పెట్రోల్ బంకుల కేటాయింపు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఆర్థికంగా సంపాదించుకునే అవకాశాలు, అలాగే మరెన్నో పథకాలు మహిళల ఆర్థిక స్థిరత్వానికి తోడ్పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, ఎంపీడీవో బాలకృష్ణ, డీపీఎం సురేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏనుగుల సాయిలు, పంచాయతీ కార్యదర్శి శ్రీజ, మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

గాంధారి: మండలంలోని మహిళలకు ఇందిరమ్మ చీరలను సోమవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద ప్రజలకు లబ్ది చేకూర్చాలంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. సింగిల్‌విండో మాజీ చైర్మన్ ముకుంద్‌రావు, మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ భాస్కర్, సర్దార్ నాయక్, శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డిలో చీరలు పంపిణీ చేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

మహమ్మద్‌నగర్: మండలంలోని గిర్ని తాండాలో ఆడపడుచులకు ఇందిరమ్మ చీరలను నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు నవాయిసింగ్, సంతోష్, గంగారాం, చందర్, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మహిళా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, ఎంపీడీవో నగేష్‌గుప్తా, తహసీల్దార్ ఉమాలత, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, శివసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని సంగమేశ్వర్, గొట్టిముక్కుల గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఇలియాస్ మహిళా సంఘ సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాత రాజు, రామస్వామిగౌడ్, ప్రభాకర్‌రెడ్డి,రాంచంద్రరెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకటిరెడ్డి, శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ మహిళలకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యేకు బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలోని పేదలకు మొ త్తం 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశానని, పనులు వేగంగా జరుగుతున్నాయని, జనవరిలో మరిన్ని ఇళ్లు మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. లింగంపేట మండల కేంద్రంలో మహిళా సంఘాల మహిళలకు రూ.10కోట్లతో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేస్తున్నామని స్థలసేకరణ సైతం పూర్తయిందన్నారు. తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో నరేష్, ఏపీఎం వినోద్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజు, నాయకులు పాల్గొన్నారు.



మోతుసంగెంలో చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం



గిర్నితాండాలో చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు



రామారెడ్డిలో చీరలను పంపిణీ చేస్తున్న నాయకులు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ షాకీర్ హైమద్

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మోడల్ పాఠశాలలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సోమవారం నషాముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎక్సైజ్ సీఐ షాకీర్ హైమద్, ప్రిన్సిపాల్ గాంధీ మాట్లాడారు. యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ దుష్ప్రభావాలు, నిర్మూలన మార్గాలు, సమాజంపై ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. యువతే దేశానికి పునాది అని, యువత మాదకద్రవ్యాల బారిన పడితే దేశ భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మునిసిపల్ కమిషనర్ మహేష్, ఏఎస్సై దేవగౌడ్, దేవీ ఆసుపత్రి వైద్యుల యశ్వంత్, విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు నవీన్, తులసీదాస్, వినోద్, భరత్, రాహుల్, సందీప్, బన్నీ, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి



మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి, ఇందుప్రియ

కామారెడ్డిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపినట్లు టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మహేష్ కుమార్ గౌడ్‌ను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వం తీసుకువస్తున్న సంక్షేమపథకాలు, అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారన్నారు. కామారెడ్డి పట్టణ అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని వివరించారు.

కోనాపూర్ చేపపిల్లల విడుదల



కోనాపూర్ చెరువులో చేపపిల్లలను వదులుతున్న నాయకులు

బాన్సువాడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామంలోని కోనసముద్రం చెరువులో ప్రభుత్వం ద్వారా వందశాతం సబ్సిడీతో అందజేస్తున్న చేపపిల్లలు 56వేలు, తిమ్మసముద్రం చెరువులో 31వేల చేప విత్తనాలను మత్స్యశాఖ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి కలిసి వదిలారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షే మం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వాలు వారికి ఉచితంగా చేప విత్తనాలను అందజేస్తుంటే చేప విత్తన పంపిణీలో కొంతమంది అధికారులు, విత్తనాలు పంపిణీ చేసే నిర్వాహకులతో చేతులు కలిపి విత్తన పంపిణీలో తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ మత్స్యకారుల జీవితాలతో ఆటలాడుతున్నారని ఆరోపించారు. చేపలను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో చేపవిత్తనాల పంపిణీపై పర్యవేక్షణ జరిపి దోపిడీని అరికట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్, మాజీ సర్పంచ్ వెంకట రమణారావు దేశ్ముక్, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, మత్స్యశాఖ అధికారి డోలిసింగ్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు సాయిలు, డైరెక్టర్లు లత రమేష్, సంఘం సభ్యులు సాయిలు, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సన్మానం



కార్యదర్శిని సన్మానిస్తున్న దృశ్యం

రామారెడ్డి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి గ్రామపంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్ జుక్కల్ మండలకేంద్రానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనను గ్రామ నాయకులు, కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవ్, నాయకులు శ్రీనివాస్ గుప్తా, గంగాధర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాల తనిఖీ చేపడుతున్న పోలీసులు

రామారెడ్డి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలంలోని గొల్లపల్లి స్టేజీ వద్ద పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని, నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు. ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజనర్సు, తదితరులు పాల్గొన్నారు.

గుండారం ప్రాథమిక పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన

రాజంపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి విక్రాంత్ సోమవారం పాఠశాలకు సరస్వతి విగ్రహాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఏంఈవో పూర్ణచందర్ రావు ఆ విద్యార్థిని అభినందించారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్థలాన్ని పాఠశాలకు ప్రొజెక్టర్‌ను అందజేశారు. రిటైర్డ్ టీచర్ అంజయ్య సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలకు 40 బెంచీలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లకు మార్కౌట్ చేస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు అందించి కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేస్తుందని ఎల్లారెడ్డి మునిసిపల్ కమిషనర్ మహేష్, తహసీల్దార్ తాహెరా బేగం అన్నారు. సోమవారం మండలంలోని నూతన ఇళ్ల నిర్మాణాలకు మార్కౌట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరై వివిధ కారణాలతో నిర్మాణాలు చేపట్టడంలో వెనుకంజ వేసిన లబ్ధిదారులకు ఇటీవల అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఎల్లారెడ్డి మునిసిపల్ కేంద్రంతో పాటుగా వివిధ గ్రామాల్లో జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. ఎల్లారెడ్డి మునిసిపల్ పరిధిలోని 1, 5, 6, 9 వార్డులలో ఇళ్ల నిర్మాణాలకు, మండలంలోని అడవి లింగాల, సాతేల్లి, మల్కాపూర్, మత్తమాల గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు మార్కౌట్ చేసి పనులు ప్రారంభించామన్నారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకుని పేదల సొంతింటి కలను సాకారం చేసుకోవాలని లబ్దిదారులకు విజ్ఞప్తి చేశారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఏదైనా సమస్యలుంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారి జ్యోతి, లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు శంకరయ్య, స్వప్న, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు తారుమారు!

(5వ పేజీ తరువాయి)

8.57శాతంగా కేటాయించారు. జిల్లామొత్తం రిజర్వేషన్లలో సామాజికవర్గం మొత్తంగా పరిశీలన చేస్తే 43.92 శాతం, బీసీ 16.07శాతం, ఎస్‌సీ 19.28శాతం, ఎస్‌టీ 21.71శాతంగా ఉంది. ప్రతీవర్గంలో మహిళలకు సగం స్థానాల్లో అవకాశాలు రావడం ప్రత్యేకంగా నిలిచింది. రిజర్వేషన్ పంపిణీ జిల్లాలో సామాజిక న్యాయం పారదర్శకంగా లభించేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మూడు విడుతల్లో ఎన్నికలు

గతంలో జిల్లాలో పంచాయతీ ఎన్నికలను రెండు విడుతల్లోనే నిర్వహించాలని జిల్లా అధికారయంత్రాంగం నిర్ణయించింది. అయితే తాజా నిబంధనల ప్రకారం ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లాలోను పంచాయతీ ఎన్నికలను మూడు విడుతల్లో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలుచేపడుతోంది. జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌లు ఉన్నాయి. మొదటి విడుతలో కామారెడ్డి డివిజన్ పరిధిలోని భిక్కనూరు,బీబీపేట, దోమకొండ, కామారెడ్డి,మాచారెడ్డి, పల్వంచ,రాజంపేట, రామారెడ్డి మండలాల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా రెండోవిడుతలో ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని గాంధారి, లింగంపేట, నాగిరెడ్డిపేట,ఎల్లారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి మండలాల్లోని జీపీలకు, బాన్సువాడ డివిజన్ పరిధిలోని నస్రూళ్లబాద్, బీర్కూర్,బాన్సువాడ, జుక్కల్,బిచ్కుంద, మద్నూర్,డొంగ్లి,పిట్లం,పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్,మహమ్మద్‌నగర్ మండలాల్లోని జీపీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు ఆయాశాఖల అధికారులు చెబుతున్నారు.

ఇసుక మాఫియా కొత్త ఎత్తుగడలు!

(5వ పేజీ తరువాయి)

తరలిస్తున్నారు. ప్రైవేట్ పైలట్ కార్ల సహాయంతో ముందుగా ఉంటూ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాసరిహద్దులను దాటించి మహారాష్ట్రకు ఇసుకను టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో ముందస్తు నిఘా ఏర్పాటు చేసిన కామారెడ్డి జిల్లాలోని సరిహద్దుల్లోని మద్నూర్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి రెండు టిప్పర్లు వాటి మార్గాన్ని క్లియర్ చేయడానికి వెళ్తున్న రెండు పైలట్ కార్లను ఆపి తనిఖీ చేశారు. తనిఖీలలో టిప్పర్లలో ఇసుక ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు విచారించగా ఇసుక టిప్పర్లు నిజామాబాద్‌లోని పోతంగల్ మంజీరా నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తేలింది. పోలీసులు 2ఇసుక టిప్పర్లును, 2కార్లు స్వాధీనం స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.టిప్పర్ డ్రైవర్లు ఇద్దరు, పైలట్ కార్లలో ఉన్న నలుగురుపై మద్నూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారంతా కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఉమ్మడి జిల్లాలోని మంజీరలో ఇసుక నిల్వలు చాలానే ఉన్నాయి. గత ప్రభుత్వంలో టీజీఎండీసీ ద్వారా ఇసుక క్వారీల నిర్వహణ నిర్వహించి కాంట్రాక్టర్‌లకు అనుమతులు ఇవ్వడంతో ప్రభుత్వానికి ఆశించిన మేర ఆదాయం సమకురేది. అయితే గత ప్రభుత్వంలో ఇసుక తవ్వకాలలో భారీగా అవినీతి జరిగిందని వచ్చిన ఫిర్యాదుల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం క్వారీలను రద్దుచేసింది. కేవలం ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ పనులకు మాత్రమే రెవెన్యూ ద్వారా ఇసుకకు అనుమతులు ఇస్తున్నారు. ఇటీవల వరదలతో మంజీరలో భారీగా ఇసుక మెటలు వేశాయి. అయితే కర్ణాటకకు చెందిన ఓ కాంట్రాక్టర్ ప్రభుత్వ పనుల పేరిట పదుల సంఖ్యలో ఇసుక టిప్పర్‌లను ఓవర్‌లోడ్‌తో జిల్లా సరిహద్దులను దాటిస్తున్నాడు. సదరు కాంట్రాక్టర్ లక్షల్లోనే దందా చేపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. అనుమతులు తీసుకోకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతుంది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

(5వ పేజీ తరువాయి)

నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని, పూర్తిచేసిన వాటికి బిల్లులు అందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ సువర్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్, సంబంధిత అధికారులు, గ్రామస్తులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

వైద్యులు 24/7 అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలి

(5వ పేజీ తరువాయి)

కోటి చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని, రాష్ట్రంలోని ప్రతీ మహిళకు సంప్రదాయ విలువలతో కూడిన చీరలను అందజేస్తూ, వారి పట్ల గౌరవాభిమానాలను ప్రదర్శిస్తున్నదని, మహిళలకు ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా, స్త్రీ శక్తిని అభివృద్ధి చేసే విధంగా పథకాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లాఅధికారులు, ఆయా శాఖల అధికారులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రతీ కొనుగోలుకు రశీదు తప్పనిసరి

(5వ పేజీ తరువాయి)

దుకాణాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో రికార్డులను పరిశీలించి స్టాకు రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం దుకాణాల్లో యూరియా నిల్వలను ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

భిక్కనూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ అన్నారు. ధూపదీప నైవేద్యం పథకానికి మండలంలోని జంగంపల్లి శ్రీ దాసాంజనేయ ఆలయం ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ చేతుల మీదుగా ఆర్డర్ కాపీని అర్చకులు భరత్‌శర్మ, గ్రామస్థులు అందుకున్నారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాలఅభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తుందన్నారు. ఆలయాల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సార్లు నరేష్, విండో చైర్మన్ సిద్దరాములు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు ఉన్నారు.

ప్రాణత్యాగం చేసిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

(5వ పేజీ తరువాయి)

చెక్కులను ఎస్‌బీఐ బృందంతో కలిసి బాధిత కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసు సిబ్బంది తమ శాలరీ ఖాతాలను పోలీసు శాలరీ ప్యాకేజ్‌లోకి మార్చుకోవడం ఎంతో అవసరమన్నారు. అనుకొని ఘటనలు జరిగినప్పుడు కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించేందుకు ఈ ప్యాకేజీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ నరసింహరెడ్డి, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్లు అక్రమ రవాణా కేసులో ఒక్కొక్కరికి రూ.5వేల జరిమానా

మద్నూర్ పోలీసుస్టేషన్‌లో పరిధిలో 2016లో సలాబాత్‌పూర్ నుంచి దెగ్లూర్ వైపు అనుమతి లేకుండా కల్లు ప్యాకెట్లు తరలిస్తున్న వారికి బిచ్కుంద మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్ ఒక్కొరికి రూ.5వేల జరిమానా విధించినట్లు ఎస్‌పీ రాజేష్‌చంద్ర తెలిపారు. సలాబాద్ పూర్‌లోని తుల్జాహీ మెకానిక్ షెడ్ వద్ద ఆటోలో కల్లు తరలిస్తున్నారని సమాచారం రావడంతో తనిఖీ చేయగా అమ్మకం లేదా నిల్వకు అవసరమైన అనుమతులు చూపించకుండా దెగ్లూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ మొగులాజీ, నిమ్మళ్వార్ సంజయ్‌లు కల్లు తరలిస్తుండడంతో పట్టుకుని కోర్టులో అభియోగపత్రం వేసినట్లు తెలిపారు.విచారణ అనంతరం సోమవారం న్యాయమూర్తి జరిమానా విధించారని ఎస్‌పీ తెలిపారు.



తేమశాతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ట్యాబ్‌ఎంట్రీని పూర్తి చేయాలి

దోమకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్యాబ్ ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలని కామారెడ్డి జిల్లా సహకార మానిటరింగ్ అధికారి జి.రమేష్ అన్నారు. సోమవారం దోమకొండ మండల విండో పరిధిలోని సంగమేశ్వర్, మాందాపూర్ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కాంటాలను వేగవంతం చేయాలని సూచించారు. కాంటా చేసిన బస్తాలను లారీల్లో లోడ్ చేసి వెంటవెంటనే తరలించాలని ఆదేశించారు. రైస్‌మిల్ నుంచి ఎప్పటికపుడు ట్రక్‌షీట్స్ తెప్పించుకుని వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఇంచార్జ్‌లు, ఆపరేటర్లు, రైతులు పాల్గొన్నారు.

పరామర్శలు.. ఆర్థికసాయాలు

బాన్సువాడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన ఉద్దెర హన్మాండ్లు ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ సురేష్‌షెట్కార్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మదుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లికి చెందిన గొర్రెల కాపరి సుధాకర్ కుటుంబాన్ని ప్రభుత్వసలహాదారు షబ్బీర్‌అలీ ఆదివారం రాత్రి పరామర్శించారు. రైలు ప్రమాదంలో గొర్రెలను కాపాడబోయి సుధాకర్ ప్రమాదవశాత్తు వాగులో పడి చనిపోయిన విషయం తెలిసిందే. కాగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన నమిలిగారి భూషణం అనారోగ్యంతో సోమవారం మృతిచెందగా అతడి అంత్యక్రియల నిమిత్తం కాలనీవాసులు కుటుంబీకులకు రూ.10వేల ఆర్థికసహాయం అందజేశారు.



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన అబ్బబోయిన బాలయ్య, చెన్నకాంతం ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి బాధిత కుటుంబీకులను సోమవారం పరామర్శించారు.ఆయన వెంట అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



అయ్యప్ప మాలధారులతో అన్నదాతలు

దోమకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప భక్తులకు సోమవారం తీగల స్వరాజ్‌గౌడ్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. 60 మంది స్వాములకు అన్నప్రసాదం అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నర్సారెడ్డి, శ్రీనివాసులుశర్మ, నరేందర్, సందీప్, శరత్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు



కల్వర్టుకు మరమత్తులు చేస్తున్న నాయకులు

రామారెడ్డి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పాడైన కల్వర్టుకు కాంగ్రెస్ నాయకుడు బండి ప్రవీణ్ సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాడైన కల్వర్టుకు సొంతంగా మరమ్మతులు చేపట్టానన్నారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, యువకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- బాహుబలి (ది ఎపిక్)
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి 12ఏ రైల్వేకాలనీ
వెంకటేశ్వర కలివి వనం

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230